ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 46
సంచిక : 173
పేజీలు : 3

ఆదివారం, మార్చి 15, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## కేంద్ర మంత్రికి సీతక్క కృతజ్ఞతలు



**టీ మీడియా, మార్చి 14 ,ములుగు:** నిర్భయ నిధి కింద కేంద్ర ప్రభుత్వం మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా తెలంగాణలోని ములుగు జిల్లాను కేంద్రం ఎంపిక చేసింది. ములుగు జిల్లాను ఎంపిక చేయడం పట్ల తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు పథకం ద్వారా ములుగు జిల్లాలో మహిళలు, బాలికల భద్రత, గౌరవం, రాకపోకల సౌకర్యాన్ని మెరుగు పరిచేందుకు జెండర్-రెస్పాన్సివ్ మౌలిక సదుపాయాలు, మెరుగైన నిఘా వ్యవస్థలు, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. ములుగులో ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీలో..

మిగతా 2లో

# ఉన్నది 15 రోజులే..

# లక్ష్యం పూర్తి అయ్యేనా..?

### -తీవ్రంగా వేధిస్తున్న సిబ్బంది కొరత

**టీ మీడియా,మార్చి14,ఖమ్మం రూరల్ :** 2025-26 సంవత్సరానికి గాను మున్సిపల్ రాష్ట్ర శాఖ నిర్దేశించిన లక్ష్యం ఏదులాపురం మున్సిపాలిటీ చేరుకునేనా అనే సందేహం మున్సిపల్ సిబ్బందిలో వ్యక్తం అవుతుంది. రాష్ట్ర శాఖ నిర్దేశించిన గడువు మరో పక్షం రోజులు మాత్రమే ఉండడంతో ఈ మేరకు టార్గెట్ చేరుకునేందుకు మున్సిపల్ యంత్రాంగం మల్లగుల్లాలు పడుతుంది. ముఖ్యంగా ఇంటి పన్ను వసూలు, ట్రేడ్ లైసెన్సుల జారీ, త్రాగునీటి నల్లాల ఆన్‌లైన్ వంటి నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకుగాను సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 2025 మార్చి నుండి 2026 మార్చి వరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ఏదులాపురం మున్సిపాలిటీకి ఇంటి పన్నులకు సంబంధించి రూ.8.21 కోట్లను టార్గెట్ పెట్టడం జరిగింది. పాత పంచాయతీల పన్నువసూళ్లను ఆధారంగా లక్ష్యాన్ని ఇచ్చారు. అయితే నేటి వరకు రూ.4.18 కోట్ల ఇంటి పన్నులు వసూలు కావడం జరిగింది. అంటే దాదాపుగా 47 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకోవడం జరిగినట్లు అయింది. 100కు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో మిగిలిన పక్షం రోజుల్లో రూ.4.20 కోట్ల నిధులను ఇంటి పన్నులను వసూలు చేయాల్సి ఉంది.దీనికి తోడు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 340 వ్యాపార సముదాయాలు ఉన్నట్లు గుర్తించినప్పటికీ వాటిలో కేవలం 200 వ్యాపార సముదాయాలకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులు జారీ చేయగా మరో 140 వ్యాపార సముదాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాల్సి ఉంది. వీటితో పాటు మున్సిపాలిటీ పరిధిలో 32 వార్డుల్లో కలిపి అధికారుల గణాంకాల ప్రకారం 6,700 త్రాగునీటి నల్ల కలెక్షన్లు ఉండగా నేటి వరకు కేవలం 3 వేల నల్లాలను మాత్రమే ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఇలా అనేక ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలకు దూరంగా ఉండటం ప్రస్తుతం మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆలోచనలోకి నెట్టేసింది. ప్రధానంగా మున్సిపాలిటీ సిబ్బంది సరిపడా లేకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుంది.

**తీవ్రంగా వేధిస్తున్న సిబ్బంది కొరత**




ప్రస్తుత 32 వార్డుల మున్సిపాలిటీ పరిధిగాను కనీసం 72 మంది వివిధ సెక్షన్లలో కలిపి ఉద్యోగులు సేవలు అందించాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే సేవలు కొనసాగిస్తున్నారు. దీంతో అనేక పన్ను వసూలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. 32 వార్డులకు గాను 32 మంది వార్డ్ ఆఫీసర్లు ఉండాల్సి ఉండగా కేవలం ఐదు ఆరుగురితో మాత్రమే నెట్టుకొస్తున్నారు. వీరికి సైతం ఇతర అనేక సెక్షన్లు అప్పగించడంతో ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్లు మున్సిపల్ నిర్వహణ కొనసాగుతుంది. ఏది ఏమైనా అత్యంత రెవెన్యూ గల మున్సిపల్ కావడం పన్ను చెల్లింపులకు ప్రజల నుండి మంచి స్పందన సైతం కనబడుతున్నప్పటికీ పన్ను వసూలు చేసే సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీ టార్గెట్ రీచ్ అవుతుందా లేదా అనేది వేచి చూడాలి.

## వెలుగుమట్ల 'వసూళ్ల' లో కీలక పురోగతి

### -నిందితుల ఆస్తులను పోలీసులు గుర్తింపు



**టీ మీడియా,మార్చి14,ఖమ్మం** :జాతీయ స్థాయిలోనూ చర్చనీయాంశంగా మారిన వెలుగుమట్ల భూముల కేసుల దర్యాప్తులో ఖమ్మం జిల్లా పోలీసులు కీలక పురోగతి సాధించారు. వెలుగుమట్ల భూముల్లో ఇండ్లు నిర్మించుకున్నవారి నుంచి డబ్బు వసూళ్లు చేశారనే అభియోగంపై ఇప్పటికే నమోదైన కేసుల్లో అరెస్టయిన నిందితుల ఆస్తులను పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని అదనపు డీసీపీ ప్రసాదరావు శనివారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు.వెలుగుమట్ల భూ ఆక్రమదారులు/నిందితులు వసూళ్లు చేసిన డబ్బును రాబట్టే చర్యల్లో భాగంగా ప్రత్యేక పోలీస్ బృందాలు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. బాధితుల నుంచి వసూళ్లు చేసిన డబ్బుతో నలుగురు నిందితులు కొనుగోలు చేసిన అక్రమ ఆస్తులను గుర్తించినట్లు చెప్పారు. ఆయా ఆస్తుల అటాచ్మెంట్ కోసం చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు అదనపు డీసీపీ తెలిపారు. కొంతమంది నిందితుల బ్యాంక్ ఖాతాల్లో జరిగిన నగదు లావాదేవీలను కూడా గుర్తించామని, ఆయా అకౌంట్ల ఫ్రీజ్ కోసం బ్యాంక్ అధికారులకు లిఖిత పూర్వకంగా సిఫారసు చేసినట్లు తెలిపారుఅదేవిదంగా ఇప్పటికే అరెస్టయిన నిందితులను పోలీస్ కస్టడీ కోసం కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. నిందితుల నుండి మరింత సమాచారం సేకరించే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కేసుల్లోని నిందితులంతా ఓ ముఠాగా ఏర్పడి ఒక్కొక్క ప్లాటును ముగ్గురు, నలుగురికి విక్రయించి డబ్బు తీసుకున్నట్లు పోలీస్ దర్యాప్తులో తేలిందన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు చట్టపరమైన చర్యలు చేపట్టామని అదనపు డీసీసీ ప్రసాదరావు చెప్పారు.

## పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్

**టీ మీడియా, మార్చి 14 ,పాల్వంచ** :జిల్లాలో నిర్వహిస్తున్న పదవ తరగతి వార్షిక పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం పాల్వంచ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,జిల్లా పరిషత్ ఉన్నత బాలికల అభ్యుదయ పాఠశాల పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించబడుతున్నాయా అనే అంశాలను పరిశీలించి, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, ఫర్నిచర్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత బాలికల అభ్యుదయ పాఠశాలలో మొత్తం 210 మంది విద్యార్థులకు గాను 209 మంది హాజరుకాగా, ఒకరు గైహాజరయ్యారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 135 మంది విద్యార్థులకు గాను 131 మంది హాజరుకాగా, నలుగురు గైహాజరయ్యారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పర్యవేక్షణ



చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,740 మంది విద్యార్థులు నమోదు కాగా, వారిలో 12,701 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 39 మంది విద్యార్థులు గైహాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 12,720 మందికి గాను 12,687 మంది హాజరుకాగా, 33 మంది గైహాజరయ్యారు. అలాగే ప్రైవేట్ అభ్యర్థుల్లో 20 మందికి గాను 14 మంది హాజరుకాగా, 6 మంది గైహాజరయ్యారు. జిల్లాలో మొత్తం హాజరు శాతం 99.74 శాతంగా నమోదైంది.పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 (బి) అమలులో ఉందని, అనుమతి లేని వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పరీక్షలు సజావుగా నిర్వహించాలని తెలిపారు.ఈ తనిఖీలు కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు



## ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

**టీ మీడియా,మార్చి14,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో మూడు సెంటర్లలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇవి ఏప్రిల్ 15 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ దుగ్గిరాల జయరాజు మాట్లాడుతూ మొదటిరోజు శనివారం మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో కలిపి 581 మంది విద్యార్థులకు గాను 581 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షల మధ్య నాలుగు రోజుల విరామం ఉండేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తగిన వెలుతురు, తాగునీరు, అత్యవసర వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైనప్పటికీ ఆలస్యంగా వచ్చే విద్యార్థులకు ఐదు నిమిషాల సడలింపు ఇచ్చినట్లు వెల్లడించారు. విద్యార్థులు తీసుకొచ్చే మొబైల్ ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరచేందుకు ప్రత్యేకంగా క్లాక్‌రూమ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో శాంతి భద్రతల కోసం పోలీసు శాఖతో సమన్వయం చేసి 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో గుంపులుగా నిలబడకుండా, జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



## ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**టీ.మీడియా,మార్చి14,చింతూరు:**చింతూరు మండలంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా జనసేన వీరమహిళ తీగల కవిత చేతుల మీదుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చట్టి జంక్షన్ నుండి ఐటిడిఏ కార్యాలయం వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీరమహిళ తీగల కవిత, మండల అధ్యక్షుడు మడివి రాజు, సీనియర్ నాయకుడు పయ్యాల నాగేశ్వరరావులు మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ వేడుకల్లో ఉపాధ్యక్షులు తీగల రవి, ప్రధాన కార్యదర్శ బేడే సతీష్, కారం దుర్గారావు, సంయుక్త కార్యదర్శులు మడివి రవి, దోమల భగత్, మీడియం సుధీర్, కుంజా నాగు, కొవ్వాసి వెంకటేష్, నగేష్, మహేష్, పొడియం నాగార్జున్, పయ్యాల ప్రవీణ్, ప్రదీప్ తదితర జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ ఎన్నికల్లో అమరవాది లక్ష్మీనారాయణకు సంపూర్ణ మద్దతు

- **ప్రకటించిన వైరా మండల ఆర్యవైశ్య మహాసభ**

**నవతెలంగాణ-వైరాటౌన్**

హైదరాబాద్ లకిడికపూల్ వాసవి గార్డెన్స్ నందు మార్చి 17వ తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలలో పోటీ చేయనున్న అమరవాది లక్ష్మీనారాయణకు వైరా మండల ఆర్యవైశ్య మహాసభ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అమూల్యమైన ఓటు అమరావది లక్ష్మీనారాయణకి వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలంటూ వైరా ఆర్యవైశ్య మహాసభ శనివారం వైరా వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహించిన సభలో తీర్మానించారు. లక్ష్మీనారాయణ గెలుపు కోసం కృషి చేస్తామంటూ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షుడు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ మొదటి ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావు, నూకల ప్రసాదరావు, కొమిరిశెట్టి శ్రీధర్, గజ్జల కృష్ణమూర్తి, దొడ్డ సుధాకర్, వనమా మల్లికార్జునరావు, కొల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్ వార్షికోత్సవ సంబురం

**ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దడం అభినందనీయం**

**నగర మేయర్ పునుకొల్లు నీరజ .**

**టీ మీడియా,మార్చి14,ఖమ్మం:**స్మార్ట్ కిడ్జ్ పాఠశాల 14వ వార్షికోత్సవం పాఠశాల మైదానంలో శనివారం అత్యాధునిక డిజిటల్ వెలుగుల్లో సంబురంగా జరిగింది.తొలుత విద్యార్థుల స్వాగత నృత్యంతో అతిథులను, తల్లిదండ్రులను ఘనంగా ఆహ్వానించారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య వార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించి అధ్యక్షఉపన్యాసం చేశారు. తమ పాఠశాల గత 14 సంవత్సరాలుగా విద్యార్థులను చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతికం, సైన్స్ ఎక్స్పో , ఒలింపియాడ్ లు తదితర అన్ని రంగాలలో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో తమ పాఠశాలకు ఎక్సలెన్సీ పురస్కారం లభించడం పాఠశాల పనితీరుకు దర్పణంగా నిలిచిందన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చి దిద్దుతున్నామన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ముఖ్య అతిథి నగర మేయర్ పూనకొల్లు నీరజ మాట్లాడుతూ చిన్నారులను స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో



ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దడం అభినందనీయం అని పేర్కొన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. జాతీయ, రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలలో పాఠశాల విద్యార్థులు ప్రతిష్టాత్మక బహుమతులను సొంతం చేసుకోవడం వారి ప్రతిభకు దర్పణంగా నిలిచిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుల్లో ఎదిగేందుకు స్మార్ట్ కిడ్జ్ పాఠశాలను ఎంపిక చేసుకోవడం హర్షనీయమన్నారు. పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య గత సంవత్సర కాలంలో పాఠశాలలో జరిగిన కార్యక్రమాల వివరాలతో పాఠశాల నివేదికను సభలో సమర్పించారు. ఈ వార్షికోత్సవంలో మరో అతిథి స్థానిక కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, విద్యార్థుల



తల్లిదండ్రులు , పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హుషారుగా పాల్గొన్నారు. సభలో ఇన్స్పైర్ సైన్స్ ఎక్స్పో , గ్రాడ్యుయేషన్ డే, వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతి ప్రధానం చేశారు. సభానంతరం విద్యార్థులు ప్రదర్శించిన జానపద , సాంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలు, లఘు నాటికలు హోరెత్తించాయి.అఖండ, కంగువా, నరసింహ స్వామి అవతారం,సమ్మక్క సారక్క నృత్యం సబికులను మంత్రముగ్ధులను చేశాయి.నూతన ఒరవడితో వినూత్నంగా డిజిటల్ లైట్ల వెలుగు జిలుగులతో నిర్వహించిన స్మార్ట్ కిడ్జ్ పాఠశాల వార్షికోత్సవం అందరిలో ఉత్సాహాన్ని నింపింది.

# ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు...

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**టీ మీడియా, మార్చి 14 ,ఖమ్మం** :జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.శనివారం జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రకాష్ నగర్ రోడ్ లోని మౌంట్ ఫోర్ట్ స్కూల్ లలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరు, పరీక్షా కేంద్రాలలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూలి జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని త్రాగు నీరు సరఫరా చేయాలని, పరీక్ష కేంద్రానికి వచ్చే ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని తెలిపారు. పరీక్ష గదుల్లో వెలుతురు, త్రాగునీరు, టాయిలెట్ నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ధైర్యం చెప్పారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో,



బాధ్యతగా నిర్వహించాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.శనివారం జిల్లాలో జరిగిన పదవ తరగతి పరీక్షకు 99.88 శాతం విద్యార్థులు హాజరు కావడం జరిగిందని, 16 వేల 962 విద్యార్థులకు గాను మొత్తం 16 వేల 941 మంది విద్యార్థులు హాజరు అయ్యారని తెలిపారు.

## భారతమ్మ ఆశయాలను సాధిద్దాం.

**-సంస్మరణ సభలో : పోతినేని సుదర్శన్**



**టీ మీడియా, మార్చి 14,కొణిజర్ల** :మండల పరిధిలోని చిన్నమనగల గ్రామంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల కుటుంబరావు తల్లి చెరుకుమల్లి భారతమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు . శనివారం ఆమె దశదిన కార్యక్రమం చిన్న మునగాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు హాజరై భారతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతమ్మ బతికినంత కాలం మంచి కమ్యూనిస్టుగా ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పోరాటం చేసిన వ్యక్తి అని ఆమె లేని లోటు గ్రామానికి పార్టీకి తీరని లోటని అన్నారు.కుటుంబం మొత్తం సిపిఎం పార్టీ అభివృద్ధికై పనిచేస్తుందన్నారు.భారతమ్మ కుమారుడు చెరుకుమల్లి కుటుంబరావు ప్రస్తుతం కొణిజర్ల మండల కార్యదర్శిగా పనిచేస్తున్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని వాటిని నెరవేర్చడంలో విఫలం అయ్యారని అన్నారు ప్రభుత్వ పెద్దలు స్వార్థం మానుకొని ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండాలని కోరారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించేందుకు ప్రయత్నం చేయాలని రైతంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొంతు రాంబాబు,మడుపల్లి గోపాలరావు, మెరుగు సత్యనారాయణ,జిల్లా నాయకులు, తాళ్లపల్లి కృష్ణ మెరుగు రమణ,సుంకర సుధాకర్, పార్టీ మండల సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య,మధు విద్యాలయం కరస్పాండెంట్ మల్లెంపాటి వీరభద్రం,వైరా రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు,గాలి వెంకటాద్రి,గుడిమెట్ల రజిత. అన్నారపు,వెంకటేశ్వర్లు,మోత్కూరి వెంకటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రికి సీతక్క కృతజ్ఞతలు

జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ.. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్తి సహకారాన్ని అందిస్తుందని కేంద్ర మంత్రికి సీతక్క తెలియజేశారు. మహిళా సాధికారత, భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవను అభినందిస్తూ.. తెలంగాణలో ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల రక్షణను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

**క్రెచ్ వర్కర్లు, హెల్పర్ల వేతనాలు పెంచాలి**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పాలనా' పథకం కింద పనిచేస్తున్న క్రెచ్ వర్కర్లు, హెల్పర్ల గౌరవ వేతనాలను పెంచాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం క్రెచ్ వర్కర్లకు నెలకు రూ. 5,500, హెల్పర్లకు రూ. 3,000 మాత్రమే గౌరవ వేతనంగా ఇస్తున్నారని.. ఇది వారు చేసే పనికి, బాధ్యతకు ఏమాత్రం సరిపోదని మంత్రి సీతక్క కేంద్రమంత్రికి వివరించారు. ఒక క్రెచ్‌లో దాదాపు 25 మంది పిల్లల సంరక్షణను చూడటం ఎంతో బాధ్యతతో కూడుకున్న పని అని.. ప్రస్తుత జీవన ప్రమాణాల దృష్ట్యా ఈ వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని మంత్రి సీతక్క వివరించారు.తక్కువ వేతనాల వల్ల నిపుణులైన సిబ్బందిని ఈ పథకంలో కొనసాగించడం కష్టమవుతోందని, ఇది పరోక్షంగా శిశు సంరక్షణపై ప్రభావం చూపుతుందన్నారు.



## నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేట్ పాఠశాల

### రెండవ శనివారం కూడా కొనసాగుతున్న విద్యాబోధన

**టీ మీడియా ,మార్చి14,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఓ ప్రైవేట్ పాఠశాల సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తుంది. ముఖ్యంగా రెండవ శనివారం ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించినప్పటికీ,ఆ ప్రైవేట్ పాఠశాల యథావిధిగా విద్యాబోధన కొనసాగిస్తున్నట్లు తెలిసింది.విద్యాశాఖ నిబంధనల ప్రకారం రెండవ శనివారం పాఠశాలలకు సెలవు ఇవ్వాలి. అయితే ఆ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఈ నిబంధనలను పట్టించుకోకుండా విద్యార్థులను పాఠశాలకు రప్పించి తరగతులు నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పరీక్షల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెంచుతూ సెలవు రోజుల్లో కూడా బోధన కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇలా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులకు విశ్రాంతి లేకుండా పోతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినా వాటిని అమలు చేయడంలో ఆ ప్రైవేట్ పాఠశాల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అంటున్నారు.

**ఎంఈఓ వివరణ**

ఈ విషయంపై సంబంధిత మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు ను వివరణ కోరగా నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇకపై సెలవు రోజుల్లో బోధన నిర్వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని వారు అన్నారు.



## శ్రీరామనవమి కు సిఎస్ఆర్ సంస్థల సహకారం అవసరం

**-జిల్లా కలెక్టర్ అంకిత్**

**టీ మీడియా, మార్చి 14 ,పాల్వంచ:**భద్రాచలంలో ఈ నెల 27న నిర్వహించనున్న శ్రీరామ నవమి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సంస్థల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.శనివారం ఐ డి ఓ సి కార్యాలయంలో వివిధ సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ, నావా లిమిటెడ్, కేటీపీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సింగరేణి, టీజీ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు గతంలో అందించిన సహకారం, ఈ సంవత్సరం అందించనున్న సహాయంపై వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నదానం, వసతి, పారిశుధ్యం వంటి అవసరమైన సౌకర్యాలు మెరుగ్గా కల్పించేందుకు సి ఎస్ ఆర్ సంస్థలు తమవంతు సహకారం అందించాలని కోరారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈఓతో సంప్రదించి అవసరమైన ఏర్పాట్ల వివరాలను సేకరించాలని ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) సంజీవరావును ఆదేశించారు. ఆ అవసరాల మేరకు సి ఎస్ ఆర్ సంస్థల సహకారాన్ని సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 3వ డివిజన్లో రంజాన్ తోఫా పంపిణీ

**నవతెలంగాణ-ఖమ్మం టౌన్**

23వ డివిజన్‌లో గల ముస్లింలకు స్థానిక కార్పొరేటర్ షేక్ మాగ్బుల్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా ఈ తుఫాను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో
డివిజన్ పెద్దలు షేక్ ఇస్మాయిల్, షేక్ లియాకత్ అలీ, గడ్డం లింగమూర్తి, ఎండి.అజీజ్, ఇలీయస్, కరిమూల, లాల, అజు, మునాఫ్ , షేక్.జామల్, ం.స.జాకిర్, బి.శ్రీనివాస్, ముజుబాయి, ఖయుం తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రణాళికలకు గండి

**కార్యదర్శుల నిర్లక్ష్యం..**

**ప్రగతి ప్రణాళిక కాగితాలకే**

**రెండవ శనివారం పేరుతో**

**ప్రణాళిక కు బ్రేక్**

**టీ మీడియా, మార్చి14, సింగరేణి (కారేపల్లి):**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అమలులో మండలంలోని సీతారాంపురం,మరికొన్ని గ్రామ పంచాయతీలలో కార్యదర్శుల నిర్లక్ష్యం వెలుగుచూస్తోంది. ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు నిర్వహించాల్సిన కార్యదర్శులు కేవలం ఫోటోలు దిగడం వరకు మాత్రమే కార్యక్రమాలు పరిమితమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండో శనివారం సెలవు పేరుతో పంచాయతీ కార్యాలయాలకు తాళాలు వేసి కార్యదర్శులు వెళ్లిపోతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 99 రోజుల ప్రణాళికలో సెలవులు లేకుండా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో అధికారులు ఉదయం కార్యక్రమం నిర్వహించినట్లు ఫోటోలు దిగిన తరువాత మధ్యాహ్నానికే కార్యాలయాలను మూసివేసి వెళ్లిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని సమాచారం. దీంతో 99 రోజుల ప్రణాళిక నిజంగా అమలవుతోందా, లేక కేవలం నివేదికలకే పరిమితమవుతోందా అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.గ్రామస్థాయి సమస్యలు



పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్న అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రణాళిక లక్ష్యాలు ఎలా సాధ్యమవుతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో 99 రోజుల ప్రగతి ప్రణాళిక అమలు తీరుపై సమగ్ర విచారణ చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శులు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సుబాబుల్ పంట నిర్వాసితుల రైతులకే దక్కాలి

**చీమలపాడు సీతారామ ప్రాజెక్టు బాధితులు**

టీ మీడియా,మార్చి14,సింగరేణి(కారేపల్లి): సీతారామ ప్రాజెక్ట్ కింద సేకరించిన భూమిలో పంట పల సాయం నిర్వాసిత రైతులకు దక్కాలని చీమలపాడు ప్రాంత భూ నిర్వాసితులైన రైతులు డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు సేకరణ భూమిలో సుబాబుల్ తోటలు కోతకు వచ్చాయని వాటిని తామే తీసుకుంటామని మంత్రులు, జిల్లా కలెక్టర్, అధికారులకు నిర్వాసిత రైతులు విన్నపాలు చేశారు. ఈ క్రమంలో అధికారులు సుబాబుల్ పంటను ఎలాంటి టెండర్లు పిలవకుండానే నరుకుతుండగా రైతులు అభ్యంతరం తెలిపారు. భూమిలో పంటకు పరిహారం అందించారని కాని ప్రస్తుతం చేతికొచ్చిన పంటను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని రైతులు ఆవేదన చేశారు. ప్రస్తుతం ఇచ్చిన పరిహారం పంట పెట్టుబడికే సరిపోతుందని, ఈ పంట నైనా తమకు దక్కేలా చూడాలని అధికారులను వేడుకున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో ఇటీవల నిర్వాసిత రైతులు సుబాబుల్ పంటను సేకరించే పనులు చేపట్టారు. వారిపై అధికారులు కారేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పంట చేతికి వచ్చిన దశలో తమ నోట్లో మన్ను కొడుతున్నారని ఇది ఎంతవరకు సమంజసం అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం



చేశారు. శనివారం రైతులు సమిష్టిగా సీతారామ ప్రాజెక్ట్ కు ఇచ్చిన భూముల్లోని సుబాబుల్ పంటను నరకటం ప్రారంభించారు విషయం తెలుసుకున్న ప్రాజెక్ట్ ఇరిగేషన్ అధికారులు ఆ ప్రాంతానికి వచ్చి రైతులను అడ్డుకున్నారు.

## ఖమ్మంలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిల్, కూరగాయల బండ్ల పంపిణీ

**టీ మీడియా, మార్చి 14 ,ఖమ్మం**

చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో సేవా కార్యక్రమం నిర్వహించి అవసరమైన వారికి సైకిల్, కూరగాయల బండ్లను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం ఇందిరానగర్‌కు చెందిన నాగలక్ష్మి అనే మహిళకు సైకిల్‌ను అందజేశారు. ఆమె పలు ఇళ్లలో పనిచేస్తూ ప్రతిరోజూ చాలా దూరం నడిచి తన పని ప్రదేశాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆమె పరిస్థితిని గమనించిన చేతన ఫౌండేషన్ ఆమె రోజువారీ ప్రయాణం సులభంగా ఉండేందుకు సైకిల్‌ను అందించింది. అలాగే చిన్న వ్యాపారాలను ప్రోత్సహించే లక్ష్యంతో వీధి వ్యాపారులకు కూరగాయల బండ్లను పంపిణీ చేశారు. దీంతో వారు తమ కుటుంబాల కోసం మంచి ఆదాయం సంపాదించుకునే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సీతారామారావు నేమలపూరి లబ్ధిదారులను ప్రోత్సహించారు. కార్యక్రమానికి సహకరించిన స్పాన్సర్‌కు చేతన ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు అనిల్ కుమార్ వెనిగళ్ల, దొడ్డ సీతారామయ్య, సురేష్, కృష్ణారావు, రామచంద్రరావు, నవీన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



# యదేచ్చగా ఇసుక రవాణా

**-మమ్మల్ని ఎవరు పట్టుకుంటారన్న ధీమా**

**టీ మీడియా,మార్చి14,పాల్వంచ:** మమ్ముల్ని ఎవరు పట్టుకుంటారు అన్న ధీమాతో కొందరు ఇసుకాసురులు యదేచ్చగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత పాల్వంచలోని మొర్రేడు వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ఇసుక అక్రమ రవాణా ఏదేచ్ఛగా సాగుతోంది. ఉదయం వేళల్లో వాగులోని ఇసుకను ఒడ్డున యార్డులో కుప్పలుగా ఏర్పాటు చేసుకొని నిలువ చేస్తుంటారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు వరుసగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక సుమారు రూ 3 నుంచి 4 వేలకు విక్రయిస్తున్నారు.ఇంత జరుగుతున్నా మైనింగ్ డిపార్ట్మెంట్, రెవెన్యూ, పోలీస్, ఎంపీడీవో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం అనేక ఆరోపణలకు దారితీస్తుంది. అక్రమార్కులకు అధికార అండదండ ఉందనే ప్రచారం సైతం సాగుతోంది. ఫలితంగానే ఇసుక సరుల అక్రమ ఇసుక రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిస్థితి ఇలానే ఉంటే వచ్చే



వేసవికాలంలో భూగర్భ జలాలు అడుగండి పోతాయనీ పాత పాల్వంచ, పాల్వంచ పట్టణ ప్రాంతంలో నీటి ఎద్దడి తాండవిస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.